ఉచితంగా మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ

సాలూరు : యుటిఎఫ్ సాలూరు మండల మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం ఎం.మామిడిపల్లి జెడ్పిహైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేశారు. అనంతరం యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ టెన్త్ పరీక్షలల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఈ మోడల్ టెస్ట్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడతాయని, విద్యార్థులంతా ఉపయోగించుకొని రాబోవు పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. 70మంది విద్యార్థులకు టెస్ట్ పేపర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ఎన్.వెంకటరావు, యుటిఎఫ్ మహిళా విభాగ సభ్యులు ఈశ్వరమ్మ, జానకి, సంతోషి, రాజమణి, లలిత కుమారి, సిహెచ్.లక్ష్మి, రజని, లక్ష్మి, అన్సారీ, స్వరాజ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, కళ్యాణి, అన్నపూర్ణ, యుటిఎఫ్ సభ్యులు బి.విజయ్ కుమార్, ఎ.గణేష్, ఐ.రాజమణి, ఎ.మన్మధరావు, సిహెచ్ లక్ష్మి, ఎస్.కృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల్ని పీడిస్తున్న అవినీతి జలగలు

- పారిశుధ్య కార్మికుల బిల్లులకూ లంచాలు
- కాసులిస్తే గాని కదలని రెవెన్యూ ఫైళ్లు
- అవుట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబాల నుంచి ముడుపులు
- పట్టించుకోని పాలక పక్షాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు మున్సిపాలిటీలో గత కొంతకాలంగా కొంతమంది ఉద్యోగులు ప్రజలను అవినీతి జలగల్లా పీడిస్తున్నారు. లంచం లేనిదే ఏ పనీ ముందుకు కదలడం లేదు. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించారు. నిర్దేశించిన ముడుపులు ముడితేగాని ఫైళ్లు కదలని పరిస్థితి కనిపిస్తోంది. గడచిన ఏడాది కాలంగా మున్సిపాలిటీకి సమర్థుడైన అధికారి కమిషనర్‌గా లేకపోవడంతో కిందిస్థాయి ఉద్యోగులు ఆడిందే ఆట, పాడిందే పాటలా సాగుతోంది. ఒక్క ఏడాదిలోనే నలుగురు అధికారులు కమిషనర్లుగా పని చేయడం, ఎవరికీ పురపాలన పై పట్టు లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో లంచావతారుల ఆగడాలకు హద్దు లేకుండా పోయింది.

ముడుపులిస్తే గాని మంజూరు కాని కార్మికుల బిల్లులు

మున్సిపల్ ప్రజారోగ్య విభాగంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారు. రోజంతా పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కార్మికులకు చెందిన ఎరియర్స్, ఇంక్రిమెంట్ల బిల్లులు మంజూరు చేయడానికి కూడా సంబందించిన సెక్షన్ గుమస్తా అడ్డగోలుగా దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ కమిషనర్, మేనేజర్ స్థాయి అధికారుల కళ్లు కప్పి ఈ గుమస్తా లంచాలు గుంజుకుంటున్నారనే వాదనలు బలంగా ఉన్నాయి. ఇటీవల కాలంలో ఇద్దరు పారిశుధ్య కార్మికుల ఇంక్రిమెంట్లు కలపడానికి వేలాది రూపాయలు లంచం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజారోగ్య విభాగంలో కార్మికుల బిల్లులేవీ మంజూరు చేయాల్సి ఉన్నా చేయి తడపనిదే పని చేయకపోవడంతో వారు గత్యంతరం లేని పరిస్థితుల్లో డబ్బులిచ్చి పనులు చేయించుకొంటున్నారు. మున్సిపాలిటీలోని సచివాలయాల సిబ్బందికి చెందిన ఇంక్రిమెంట్లు, మెడికల్ సెలవులు మంజూరు చేయడానికి దండిగా ముడుపులు తీసుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం మృతి చెందిన ముగ్గురు అవుట్ సోర్సింగ్ కార్మిక కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగ నియామకాలు చేపట్టారు. నిబంధనల ప్రకారం ఈ ముగ్గురు కార్మిక కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చినా ఒక్కో కార్మిక కుటుంబం నుంచి రూ.70వేలు చొప్పున ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఆరునెలలకోసారి స్పెషల్ ఇంక్రిమెంట్లు కలపడానికి కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ కార్మికుల, ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్లను పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉచితంగానే రాసి ఇస్తున్నారు. అయినా ఆ గుమాస్తా మాత్రం జలగలా పీడిస్తున్నారు.

రెవెన్యూలో దండిగా వసూళ్లు

మున్సిపల్ రెవెన్యూ విభాగంలోనూ వసూళ్ల పర్వం దండిగా కొనసాగుతోంది. ఇంటి పన్ను పేరు మార్చాలన్నా, ఇంటి అమ్మకాలపై రిజిస్ట్రేషన్ ఫీజులకు సంబంధించి మున్సిపాలిటీకి చెల్లించాల్సిన మార్కెట్ ఫీజు వసూళ్లలో రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీకి అధికారికంగా ఎంత సొమ్ము చెల్లిస్తారో అంతే మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం పట్టణంలో ఆస్తుల క్రయవిక్రయాలపై మున్సిపాలిటీకి ఒక శాతం ఫీజు చెల్లించాలని కౌన్సిల్‌లో ఆమోదించారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు ఒక శాతం ఫీజు వసూలుతో ప్రజలపై భారం పడుతుందని, దాన్ని అరశాతం తగ్గించాలని కౌన్సిల్‌లో మళ్లీ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించారు. దీంతో ప్రభుత్వం అరశాతం అమలుకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు అమలులో ఉన్నా అధికారులు మాత్రం ఒక శాతం ఫీజు నే వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పట్టించుకోని పాలక పక్షాలు

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉంది. మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గం పరిపాలిస్తోంది. అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే సంధ్యారాణి ఏడాదిన్నర కాలంగా మంత్రిగా వున్నారు. వైసిపి పాలకవర్గం మున్సిపాలిటీలో ఉన్న కారణంగా ఆమె చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక మున్సిపల్ చైర్ పర్సన్‌గా పువ్వుల ఈశ్వరమ్మ ఉన్నారు. పురపాలనపై పట్టు లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో ఏం జరుగుతుందో ఆమె తెలుసుకోలేని స్థితిలో ఉన్నారు. మున్సిపల్ కమిషనర్‌గా నాలుగు నెలలకో అధికారి రావడంతో వారికి కూడా పాలనపై పట్టు దొరకడం లేదు. దీంతో మున్సిపాలిటీలో కీలకమైన విభాగాల అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చేతికి అందిన కాడికి నొక్కేసే పనిలో ఉన్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

మున్సిపాలిటీపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. పురపాలన గాడి తప్పింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడం లేదు. వేర్వేరు పనులపై సేవలు పొందడానికి వచ్చే జనాలను కిందిస్థాయి ఉద్యోగులు జలగల్లా పీడిస్తున్నారు. స్థానికంగా మంత్రి సంధ్యారాణి ఉన్నప్పటికీ పురపాలన పై దష్టి సారించడంలేదు. పాలకవర్గం ఉన్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

ఎన్వై నాయుడు,
మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి

సమస్యల పరిష్కారంలో జిల్లా ఫస్ట్ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందిన వినతులను పరిష్కారం లో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు కృషిచేసిన జిల్లా అధికారులను ఆయన అభినందించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ వినతులపై ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమైన తర్వాత మళ్లీ పునఃప్రారంభం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండల, జిల్లాస్థాయిలో జరిగే పిజిఆర్ఎస్‌లో వచ్చిన వినతులను నాణ్యతతో కూడిన పరిష్కారం ఉండాలని అన్నారు. అలాగే సమస్యల పరిష్కారం పట్ల అర్జీదారులు సంతృప్తి చెందాలని సూచించారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందని, అలాగే వీటిని ఆడిట్ చేస్తుందన్నారు. కావున ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించి వినతులను పరిష్కరించాలని అన్నారు. అలాగే అర్జీల పరిష్కారానికి నిర్దేశించిన పట్టిక ద్వారా వివరాలు తెలియజేయాలని స్పష్టం చేశారు.

పింఛన్ల పంపిణీలో రాష్ట్రస్థాయిలో జిల్లా మూడో స్థానం

జిల్లాలో పంచాయతీల కంటే రెండింతలు హేబిటేషన్లు ఉన్నాయని, అందువల్ల మూడో రోజు కూడా పింఛన్లను పంపిణీ చేసేందుకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కోరారు. గురువారం జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శత శాతం ఇంటి వద్దనే పింఛన్లను తొలి రోజే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పంపిణీలో రాష్ట్ర స్థాయిలో జిల్లా మూడవ స్థానంలో ఉందని తెలిపారు. అయితే నెట్ వర్క్ సమస్య , హేబిటేషన్లు అధికంగా ఉన్నందున అవసరమైతే రెండవ రోజుతో పాటు మూడో రోజు కూడా పంపిణీ చేసుకునేలా ఆదేశాలు కోరగా సీఎస్ అంగీకరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సమీక్షించిన సీఎస్ ఈ నెల 17,18 తేదీల్లో జరగనున్న కలెక్టర్ల సమావేశానికి సిద్ధం కావాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ హేమలత, ఎస్డిసీ ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఆర్డిఎ పీడీ ఎం.సుధారాణి, డిపిఒ టి.కొండలరావు, సిపిఒ ఎస్ఎస్ఆర్ పట్నాయక్, డీటీపీసీ తదితరులు పాల్గొన్నారు.

పిఒ చర్యలు సరికాదు : యుటిఎఫ్

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయులను ప్రాజెక్టు అధికారి భయభ్రాంతులకు గురిచేసి మానసిక వేదనకు గురి చేస్తున్నారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు రాత్రి బస చేయాలని, రాత్రి తొమ్మిది గంటల నుంచి 12 గంటలకు, ఉదయం 6 గంటలకు ఉన్నట్లు ఫోటోలు పెట్టాలనడం సరికాదని, అధికారుల వైఖరిని యుటిఎఫ్ ఖండిస్తుందని అన్నారు పిఒ రాత్రి 11 గంటలకు విజిట్ చేసి ఉపాధ్యాయులు బస చేయలేదని క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం అన్యాయమని అన్నారు.. ఉపాధ్యాయులకు కూడా కుటుంబాలు ఉన్నాయని, మానవ హక్కులు ఉన్నాయని వెంటనే ఈ క్రమశిక్షణా చర్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను నైట్ వాచ్మెన్‌లుగా చిత్రీకరిస్తూ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 15న స్థానిక ఐటిడిఎ ముందు నిరసన చేపడుతున్నామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు గౌరవ అధ్యక్షులు ఎ.భాస్కరరావు, కె.కృష్ణారావు తెలిపారు.

చెల్లింపుల ప్రక్రియ పాదర్శకంగా ఉండాలి

ధాన్యం నాణ్యతకు తగ్గట్టుగా రైతులకు మద్దతు ధర అందించాలి : జెసి

ప్రజాశక్తి - సీతానగరం/వీరఘట్టం/గరుగుబిల్లి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రాకపోకలు, చెల్లింపుల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బంది, మిల్లర్లపై ఉందని, ధాన్యం నాణ్యత ఆధారంగా రైతులకు మద్దతు ధర కల్పించాలని తెలిపారు. వీరఘట్టం మండలం నడికెళ్ల, సీతానగరం మండలం సూరంపేట, గరుగుబిల్లి మండలం నాగూరు, పార్వతీపురం మండలం నర్సిపురంలో గల రైతు సేవా కేంద్రాలు, ధాన్యం సేకరణ కేంద్రాలను (పీపీసీ) జాయింట్ కలెక్టర్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా ధాన్యం కొనుగోలు పరిస్థితులు, రైతులకు అందుతున్న సేవలు, తూనిక యంత్రాల పనితీరు, ధాన్యం నాణ్యతా పరీక్ష ప్రక్రియ, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలు రైతులకు మరింత సులభతరం కావాల్సిన అవసరాన్ని జేసీ స్పష్టం చేశారు. ధాన్యం రాకపోకలు, చెల్లింపుల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని సంబంధిత విభాగ సిబ్బందికి సూచించారు.

బియ్యం సేకరణ కేంద్రం ప్రారంభం

సీతానగరం: మండలంలోని సూరంపేటలో ఏర్పాటు చేసిన ఎఫ్‌సిఐ బియ్యం సేకరణ గోదామును జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లు ధాన్యం ఆడించాక ఈ రోజు నుంచి బియ్యాన్ని గోదాములో నిల్వ ఉంచడం జరుగుతుందన్నారు. ఈ గోదాముకు 66,643 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లక్ష్యంగా ఇచ్చామన్నారు. అందులో భాగంగా మిల్లర్లు సిఎంఆర్ బియ్యాన్ని త్వరగా గోదాముకు అందించాలన్నారు. ఎప్పటికప్పుడు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులను సమన్వయం చేసుకోవాలని జెసి మిల్లర్లకు సూచించారు. అనంతరం సిఎంఆర్ బియ్యాన్ని గోదాములోకి పంపారు. అంతకుముందు సూరంపేట రైతు సేవా కేంద్రం, చినరాయుడుపేటలోని రైస్ మిల్లులను జెసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో ఆడిస్తున్న బియ్యాన్ని పరిశీలించారు. నాణ్యతకు తగ్గట్టుగా రైతులకు మద్దతు ధరను ఇవ్వాలని, వారికి అవసరమైన గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని అన్నారు. ఆర్ఎస్‌కె వద్ద ఉన్న రైతులతో ముచ్చటించిన జెసి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకుంటున్న సంగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఎంసిఎస్ శ్రీనివాస్, డిఎస్ఒ, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు రవి, ఎంఎఒ ఎస్. అవినాష్, ఇతర మిల్లర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

గరుగుబిల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జెసి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది హాజరు, శుభ్రత, మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, అవుట్‌పేషెంట్ విభాగం, ప్రసూతి సేవలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. రోగులకు సమయానికి నాణ్యమైన వైద్య సేవలందేలా వైద్య సిబ్బంది క్రమశిక్షణగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అత్యవసర సేవలు, అంబులెన్స్ అందుబాటు, రికార్డుల నిర్వహణపై బాధ్యత వహించే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆరోగ్య కేంద్రం 24 గంటలు అత్యవసర సేవలతో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. లోపాలు గుర్తించిన చోట వెంటనే సరిచేసే చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లు

- సమస్య వస్తే ఆర్ఎస్‌కెలదే బాధ్యత : కలెక్టర్
- కళ్లాల నుంచే నేరుగా సేకరణ
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కాల్ సెంటర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పూర్తిస్థాయిలో వరి కోతలు మొదలయ్యాయని, అందువల్ల రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు మిల్లుల వద్దకు ధాన్యాన్ని తీసుకుపోవాల్సిన అవసరం లేదని, కల్లాల వద్ద తూకం వేసి నేరుగా ధాన్యం కొనుగోళ్లు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే జిల్లాలోని రైతుల అవసరాలకు మించి గోనె సంచులు, రవాణా సదుపాయాలను ఏర్పాటుచేశామన్నారు. అయినప్పటికీ రైతులు స్వంతంగా ఖర్చు చేసే ప్రతి పైసాను వారి ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ఇప్పటికే 1015 శిబిరాలను నిర్వహించి రైతులకు ధాన్యం కొనుగోళ్లపై మిల్లర్లు, వ్యవసాయ అధికారులు, పీపీసీలు, పౌర సరఫరాల శాఖాధికారుల సమక్షంలో పూర్తిస్థాయిలోఅవగాహన కల్పించామని అన్నారు. రైతులకు సమస్యలు ఉంటే రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయ వచ్చని, అక్కడే అధికారులు సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. అలాగే రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కాల్ సెంటర్ ను ఏర్పాటు చేశామని, సమస్యలు ఉంటే 08963-221003 లేదా 77020 03582 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేస్తే, తక్షణమే పరిష్కారం చేస్తారని కలెక్టర్ ప్రకటించారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది నేరుగా రైతు కళ్లాం వద్దకే వచ్చి, ధాన్యాన్ని తూకం వేసి, కొనుగోలు చేస్తారని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడైనా రైతులకు ఇబ్బందులు ఎదురైతే, వారు వెంటనే సంబంధిత విఎఎ లేదా కొనుగోలు కేంద్రాలకు తెలియజేయాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే బాధ్యత పూర్తిగా ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ లేదా రైతు సేవ కేంద్రానిదే అవుతుందని అన్నారు. కొనుగోళ్ల విషయంలో ఎటువంటి అపోహలు, ఇబ్బందులు లేకుండా, రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ ఈ చర్యలు తీసుకున్నామని, రైతులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రైతులు ఖచ్చితంగా ధాన్యం నాణ్యతగా ఉన్నట్లు చూసుకోవాలని, తేమ 17శాతం లోపు, మట్టి పెల్లలు, రాలు చెత్త ఒక శాతం లోపు, అపరిపక్వ, ముడుచుకుపోయిన, వంకర గింజలు 3 శాతం లోపు, మొలకెత్తిన, రంగు మారిన, చెడిపోయిన పురుగు తిన్న గింజలు 5శాతం మించకుండా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్డిఎ పీడీ, డిఎస్ఓ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

లక్ష్మీనారాయణ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గుమ్మలక్ష్మీపురం : గ్రామానికి చెందిన బోటు సంతోష్ బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అకస్మాత్తుగా కొడుకును కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

'ఉపాధి' కల్పించాలి

- బకాయి బిల్లులు చెల్లించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గిరిజన గ్రామాల అన్నింటికీ ఉపాధి పనులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని లోవ ముఠా ప్రాంతంలో అనేక గ్రామాలకు ఉపాధి పనులు కల్పించడం లేదన్నారు. నూర్పు యంత్రాలు వచ్చిన తర్వాత వరి కోతలు 10, 15 రోజుల్లోనే పూర్తయ్యాయని, వరి కోతలు లేకపోవడంతో గిరిజనులు వలసలు వెళ్లిపోతున్నారని తెలిపారు. కాబట్టి పనులు కల్పించని గిరిజన గ్రామాలకు అన్నింటికీ పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేయనున్నట్టు తెలిపారు. అలాగే గత రెండు నెలలుగా పనిచేసిన వారికి బిల్లుల బకాయిలు చెల్లించలేదని, వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాది హామీని నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతుందని, అందులో భాగంగానే పైలెట్ ప్రాజెక్టు కింద మన్యం జిల్లాను ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ వేయడానికి తీసుకున్నారని, దీనివల్ల కూలీలకు పనులు దొరకడం కష్టమవుతుందని అన్నారు. ఇప్పటికే అనేకమందికి జాబ్ కార్డులు రద్దు చేశారని, ఉపాధిహామీని ఎత్తి వేయడానికి కూలీలు విసిగిపోయేలా ఈ చట్టాన్ని పూర్తిగా లేకుండా చేయడానికి చూస్తుందని విమర్శించారు. అందులో భాగమే రెండు పూటల పని విధానం, ఫేస్ యాప్, మేట్లుకు ప్రోత్సాహం ఇవ్వకపోవడం, పారలు, తట్టలు, గుణపాలకు మెయింటెనెన్స్ ఖర్చులు, టెంట్లు మెడికల్ కిట్లు ఇవ్వకపోవడం అన్ని రకాలుగా ఉపాధి కూలీలకు ఇబ్బందులు గురి చేస్తున్నారని అన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు మండంగి రమణ, కోలక అవినాష్, పువ్వల తిరుపతిరావు, బిడ్డక శంకర్రావు ,ఆడిట్ కె .గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

ధాన్యం నాణ్యతపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు

ప్రజాశక్తి - పార్వతీపురం

ధాన్యం నాణ్యతా లోపం వల్లే కొనుగోలు ధరలు తగ్గుతున్నాయని రైతులను తప్పు పట్టేలా రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాంబాబు అలియాస్ రవి చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో రైస్ మిల్లుల్లో జరిగిన దోపిడీలను అరికట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు చేపట్టిన చర్యలకు రైతులను తప్పుపట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. నాణ్యతా లోపం మిల్లుల్లో మాత్రమే ఉందని రైతు పండించే పంటల్లో లేదని తేల్చి చెప్పారు. రైతులపై తప్పుడు నిందలు మోపడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి రైతు సంఘం పార్వతీపురం డివిజన్ పర్యటనలో భాగంగా రైతుల సమస్యలను గుర్తించే క్రమంలో రైతులు మిల్లర్లకు అందించే ధాన్యంలో అనేక షరతులను జోడించి ప్రభుత్వం ప్రకటించే ధర కంటే చాలా తక్కువ ధరకు కొనుగోలు చేపట్టి మోసగిస్తున్నారని పేర్కొన్నారు. ధాన్యంలోనే నాణ్యతలోపం ఉందని మిల్లర్ల అసోసియేషన్ భావిస్తున్నట్లయితే రైతులతో పాటు ఎపి రైతు సంఘం బహిరంగ చర్చకు సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. రైతులు మిల్లర్లకు ధాన్యాన్ని అందిస్తే అక్కడ నుంచి రైతు సేవా కేంద్రాలకు తరలించే ప్రక్రియ మిల్లర్లదేనన్న నిబంధన ఉందని, దాన్ని పట్టించుకోకుండా రైతులను బెదిరించి, భయపెట్టి వారిచేతనే రైతు సేవా కేంద్రాలకు తరలించే ప్రయత్నం మిల్లర్ల యాజమాన్యం చేస్తుందని అన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల పండించే ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేపట్టాలని కోరారు. అనేక అక్రమాలకు పాల్పడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న మిల్లర్లపె, అలాగే యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాంబాబు (రవి) రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు మిల్లర్ల వద్ద ఎపి రైతు సంఘం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుందని హెచ్చరించారు. దీనికి బాధ్యత ప్రభుత్వమే వహించాల్సి వస్తుందని బంటు దాస్ చెప్పారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా 'డొంకాడ'

ప్రజాశక్తి - కురుపాం

ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జియ్యమ్మవలస మండలం చినకుదమ గ్రామానికి చెందిన డొంకాడ రామకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం అరుకు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆయన కురుపాం ఎఎంసి చైర్మన్‌గానూ బాధ్యతలు చేపట్టారు. డొంకాడ నియామకం పట్ల నియోజకవర్గ టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే జగదీశ్వరి ప్రోత్సాహించి తనకు ఈ పదవిని అప్పగించినందుకు పార్టీకి, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానని అన్నారు. ఎమ్మెల్యే, పార్టీ అధిష్టానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక ఎంపిడిఒ ఎంవి రంగారావును సిఐటియు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యూనియన్ నాయకులు కె నారాయణరావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఇదే వృత్తిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్ కల్పించకుండా మ్యాన్ డేస్ పేరుతో ప్రభుత్వాలు తీవ్ర అన్యా చేస్తున్నాయని, రిజిస్టర్లు ఇవ్వడం లేదని, పేపర్లు, స్టేషనరీ ఖర్చులు భరించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడు రికార్డులకు రూ.5వేల వరకు ఖర్చవుతుందని, ఫీల్డ్ అసిస్టెంట్లు పరిధిలో లేని యాప్‌ల పని కూడా చేస్తున్నారన్నారు . ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నత చదువులు చదివిన వారు ఉన్నారని, అలాంటి వారికి కేవలం రూ.5,740 వేతనం ఇచ్చి జీవితానికి ఎలాంటి భరోసా లేకుండా చేయడం దారుణమన్నారు. 5జి సెల్ ఫోన్లు, మస్తర్లు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి ఎంపిడిఒ స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఎం.రవి, టి.బంగారయ్య, బి.ఆదినారాయణ, యు.ఉజ్జయ్య, ఎ.దమయంతి, శ్రావణి, గౌరీశ్వరి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

నర్సిపురంలో వైద్య కళాశాలకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మండలంలోని నర్సిపురంలో ప్రభుత్వం పిపిపి పద్ధతిలో నిర్వహించనున్న మెడికల్ కాలేజీ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర గురువారం అధికారులు, ఎన్‌డిఎ కూటమి నాయకులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించి, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు గల సానుకూల పరిస్థితులు గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మెడికల్ కాలేజీ ఏర్పాటుకు స్థల సేకరణతో పాటు నర్సిపురం గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ ఉమ్మడి నాయకులు పాల్గొన్నారు.

తెలుగు పండిట్లకు ఉద్యోగోన్నతి పై హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న తెలుగు, హిందీ పండిట్లు, పిఇటిలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించడం హర్షణీయమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు,హిందీ పండిట్లు, పిఇటిల పోస్టులు 417 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించడం హర్షణీయమని చెప్పారు. దీనికి చంద్రబాబు నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి లకు అభినందనలు తెలిపారు.

నియామక పత్రాన్ని అందిస్తున్న అధికారులు

సజావుగా కో-ఆప్షన్ సభ్యుని ఎన్నిక

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక మండల ప్రజా పరిషత్‌లో కో-ఆప్షన్ సభ్యుని అనుబంధ ఖాళీ సంబంధించిన ఎన్నిక గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సజావుగా జరిగింది. ఈ ఎన్నికకు పరిశీలకుడిగా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి హాజరై ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించామని జెసి చెప్పారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకున్నారు. అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు సహకరించడంతో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రక్రియ పూర్తయ్యింది. అనంతరం సర్టిఫికెట్లను జేసీ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో ద్వామా పీడీ కె.రామచంద్రరావు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్రీదేవికి పితృ వియోగం

ప్రజాశక్తి - పార్వతీపురం

సిపిఎం మన్యం జిల్లా కమిటీ సభ్యులు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రెడ్డి శ్రీదేవి తండ్రి వి.కృష్ణమూర్తి గురువారం వృద్ధాప్యంతో వారి స్వగ్రామం బొబ్బిలి మండలం రంగరాయపురంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు రంగారాయపురంలో అతని పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. మన్యం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి ఇందిర, ఎన్ వై నాయుడు, ప్రజాసంఘాల నాయకులు బి.లక్ష్మి, తులసి, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పుష్పశ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన బోటు లక్ష్మీనారాయణ తనయుడు బోటు సంతోష్ అకాల మరణం అత్యంత బాధాకరమని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మృతుని కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఎంపిపిలు కె దీనమయ్య, శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసిలు రాధిక, జి.సుజాత, గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట సర్పంచులు బి.గౌరీ శంకర్రావు, ఆర్ చైతన్య స్రవంతి, వైసిపి నాయకులు ఉన్నారు.

వికలాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వికలాంగుల్లో దాగి ఉన్న కళలను, ఆటలు, క్రీడలను వెలికితీసి వారిలో ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని నింపాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ సందర్భంగా జిల్లాస్థాయి ఆటల పోటీలు గురువారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి డిఆర్ఒ ముఖ్య అతిథిగా పాల్గొని స్కూటర్ ర్యాలీ, రన్నింగ్, వాకింగ్ వంటి పలు పోటీలకు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విజేతలకు గిరిమిత్ర హాలులో బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు వారి సంక్షేమానికి, అభివృద్ధికి అవసరమైన పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా మూడు చక్రాల సైకిళ్లు, చంక కర్రలు, వీల్ చైర్స్, అంధులకు చేతి కర్రలు, కళ్లజోళ్ళు, శ్రవణ పరికరాలు వంటివి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వికలాంగుల పట్ల మానవతా దృక్పథంతో మనమంతా సేవ చేయాలని, ప్రభుత్వం కూడా వికలాంగుల పట్ల చిత్తశుద్ధితో అనేక సంక్షేమ పథకాలతో పాటు ఆరు వేల పింఛన్‌ను అందిస్తుందని గుర్తుచేశారు. స్కూటర్ రేస్‌లో ప్రథమ స్థానంలో ఎం.ప్రసాద్, ద్వితీయ స్థానంలో కె.రమేష్, వాకింగ్ (మహిళ)లో ప్రథమ స్థానం ఎం.రమణి, ద్వితీయ స్థానం పి.లక్ష్మి కైవసం చేసుకోగా, విజేతలకు డిఆర్ఒ బహుమతులను పంపిణీ చేశారు. అలాగే రన్నింగ్ (మహిళ) లో ప్రథమ స్థానం కె.గౌరమ్మ, ద్వితీయ కె. రాములమ్మ, పురుషుల విభాగంలో ప్రథమ ఎం.సంతోష్, ద్వితీయ ఎ.శివ, సింగింగ్ మెన్స్ లో ప్రథమ స్థానం ఎం.దువ్వు నాయుడు, ద్వితీయ స్థానం ఎన్.వితలేశ్వరరావు, మహిళల్లో ప్రథమ ఎం.మంగ, ద్వితీయ దమయంతి రాగా వారందరికీ బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంధులైన ఎం.వెంకటేశ్వరరావు, జి. అభిరామ్‌కు డిఆర్ఒ బ్లైండ్ స్టిక్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్నప్రతిభవంతుల శాఖ అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న డిఆర్ఒ హేమలత

గిరిజన విద్య మెరుగుపరిచేందుకు చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్య మెరుగుపడేందుకు విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు వీలుగా ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు భవన నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తోందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని భద్రగిరి పిటిజి బాలికల ఆశ్రమ గురుకుల పాఠశాలలో డిఎ -జగు పథకం కింద రూ.167.50 లక్షలతో మంజూరు చేసిన నూతన పాఠశాల భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతన భవనం పూర్తయితే విద్యార్థులకు మరింత అనుకూల వాతావరణం లభించి, చదువులో మరింత పురోగతి సాధిస్తారని తెలిపారు. ప్రభుత్వం గిరిజన ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, ఇలాంటి విద్యాసంస్థల అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, రాష్ట్ర కార్యనిర్వాహణ మహిళా కార్యదర్శి బిడ్డిక పద్మావతి, నాయకులు మండంగి భూషణరావు, వెంపటాపు భారతి, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, తోటపల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రపంచ తెలుగు మహాసభకు ఆహ్వానం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావుకు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మకమైన ప్రపంచ తెలుగు మహాసభలు-2026కు హాజరు కావాల్సిందిగా ఆయనకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ స్వయంగా ఆహ్వాన పత్రికను సాయి శ్రీనివాసరావుకు పంపారు. జనవరి 3, 4 తేదీల్లో గుంటూరులోని నందమూరి తారకరామారావు వేదికపై ఈ మహాసభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభలకు తనను గుర్తించి ఆహ్వానం పంపినందుకు డాక్టర్ గజల్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు విద్యారంగానికే కాక, తెలుగు భాషా సాహిత్యానికి, సామాజిక సేవకు విశేష కృషి చేస్తున్నారు. ప్రతి ఏటా పాఠశాల ఆధ్వర్యంలో పద్యాలు, తెలుగు సామెతల పోటీలు, ఉగాది పర్వదినం సందర్భంగా బాల కవి సమ్మేళనం వంటి సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. తెలుగు సాహిత్యం పట్ల ఆయనకున్న అంకితభావానికి గుర్తింపుగా ఈ ఆహ్వానం అందడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. తెలుగు సాహితీ సభ్యులు, పాఠశాల సిబ్బంది, వైద్యులు వి.గణేశ్వరరావు, ఆరిశెట్టి మోహనరావు, పారిశ్రామికవేత్త మండవల్లి వెంకటేశ్వరరావు, కోపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కూనిశెట్టి భీమారావు తదితరులు సాయి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు. సాలూరు వాసికి ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం దక్కడం పట్ల పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.10 లక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా పోలీసుశాఖలో కానిస్టేబులుగా పని చేస్తూ, బ్రెయిన్ కేన్సర్ వల్ల మరణించిన పాడి బాబురావు భార్య మాధురికి స్టేట్ బ్యాంకు పోలీసు సేలరీ ప్యాకేజ్ ప్రయోజనంగా మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్‌ను స్టేట్ బ్యాంకు అధికారుల సమక్షంలో గురువారం ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, అందరికీ స్టేట్ బ్యాంకు పోలీసు సేలరీ ప్యాకేజ్‌ను ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఈ ప్యాకేజ్ ప్రయోజనంలో భాగంగా ఎవరైనా పోలీసు ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవసాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ప్రస్తుతం రూ.1కోటి, సాధారణ మరణం సంబవిస్తే 10 లక్షలు ఆర్థిక సహాయంను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అందిచనుందన్నారు. ఇందులో భాగంగా సీతంపేట పోలీసు స్టేషనులో కానిస్టేబులుగా పనిచేసి మృతి చెందిన పాడి బాబు రావు కుటుంబ సభ్యులకు రూ.10లక్షల చెక్కును అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఆర్ఐలు నాయుడు, పాలకొండ ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజరు హిమాన్షు బెహెర, కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న ఎస్‌పి మాధవ్ రెడ్డి

కొత్త బస్సులు తెప్పించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

డొక్కు బస్సులు స్థానంలో కొత్త బస్సులు తెప్పించాలని, జిల్లా ప్రజలకు ఆర్‌టిసి సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఒబిసి చైర్మన్ వంగల దాలి నాయుడు, నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, ఎస్‌సి సెల్ చైర్మన్ కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ, జడ్డిడి సింహాచలం తదితరులు జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలోని పలు ప్రాంతాల నుండి విద్యార్థులు పార్వతీపురం పట్టణానికి చదువుకునేందుకు వస్తున్నారనీ, ఉదయం వారికి వారి వారి బస్ స్టాపుల్లో బస్సులు ఆపకపోవడం వల్ల తమ పాఠశాల కళాశాలలకు సకాలంలో చేరుకోలేక పాఠాలు నష్టపోతున్నారని అన్నారు. రద్దీకి తగ్గట్లు బస్సులు పెంచాలన్నారు. రాత్రివేళ ఆర్‌టిసి బస్సుల నేమ్ ప్లేట్ వద్ద లైట్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారనీ చెప్పారు. మన్యం జిల్లాలో ఉన్న బలిజిపేటకు బస్సులు నడపకపోవడం అన్యాయమన్నారు. కూనేరు, జియ్యమ్మవలస, రావివలస మీదుగా పెదబుడ్డిడి, ములగ జంక్షన్ మీదుగా డోకిశీలకు బస్సులు నడపాలన్నారు. గౌరీపురం బస్సు సమయపాలన పాటించాలన్నారు.

రవాణా అధికారికి వినతి పత్రాన్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం

యుటిఎఫ్ సీతానగరం మండల శాఖ కౌన్సిల్ సమావేశం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగినది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి నీరస శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వ నిర్లిప్తత ధోరణిని దుయ్యబట్టారు. పరిశీలకులుగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల ప్రక్రియలో మండల నూతన కార్యవర్గాన్ని ఉపాధ్యా యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవాధ్యక్షులుగా తీల మధుసూదనరావు, అధ్యక్షులుగా మద్రాపు గోవిం దరావు, సహాధ్యక్షులుగా బూరాడ ఆదినారాయణ, మహిళా సహాధ్యక్షురాలిగా కూనలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బొత్స ప్రసాదరావు, కోశాధికారిగా డోకల వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పల్లె శ్రీనివాసరావు, కింతలి ఉమామహేశ్వరరావు, తెర్లి అప్పలనాయుడు, మండల కౌన్సిల్ సభ్యులుగా గొర్లి పోలినాయుడు, కునుకు మురళి, ఆది వెన్నెల శంకరరావు, వెన్నెల తవిటి నాయుడు, జాగాన సింహాచలం, నాగులకొండ త్రినాథ్, బలగ ప్రసాద్, కే కష్ణ దాస్, రాయల శంకరరావు, కర్రి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గంచే పరిశీలకులు ప్రమాణ స్వీకార ప్రతిజ్ఞ చేయించారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న యుటిఎఫ్ నూతన కార్యవర్గం

బాల్య వివాహాల నివారణకు కృషి

ప్రజాశక్తి - కొమరాడ

బాల్య వివాహాలు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొమరాడ ప్రాజెక్టు సిడిపిఒ జి.సుగుణకుమారి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల రైతు మండలంగా తీర్చిదిద్ది బాల్య వివాహాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేసే విధంగా అన్ని శాఖల అధికారులకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. జిల్లాలో బాలల సంరక్షణ కోసం చేపడుతున్న చర్యలను ప్రజలకు అధికార వర్గాలకు వివరించారు. మండలంలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లయితే తక్షణమే స్థానిక ప్రజలు 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించి బాల్య వివాహాల నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలతో కలిసి ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ డిసిపిఒ ఏఎస్ సత్యనారాయణ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు శారద, లక్ష్మీ, బంగారమ్మ, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసు ఎనమ్మ పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పాంచాలిలో ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడని దేశీయ వరి రకాల క్షేత్ర ప్రదర్శన ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిద్ధ సన్నాలు, పాలేకర్ సాంబ, ఢిల్లీ బాస్మతి వంటి రకాలను పూర్తి స్థాయి ప్రకృతి సేద్యంలో సాగు చేశారని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. పాలేకర్ సాంబరకంలో పంట కోత ప్రయోగం చేయగా ఎకరానికి 18 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. ఈ మూడు రకాలు దేశీ వరి రకాలని, వీటి దిగుబడిని ప్రస్తుత అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలతో పోల్చకూడదని తెలిపారు. ఈ దేశీరకాల్లో తక్కువ గ్లూకోస్ శాతం ఉండడం వలన మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచి ఆహారం అవుతుందని, కొవ్వు, సోడియం తక్కువగా ఉండడం వల్ల గుండె జబ్బులు రాకుండా నివారిస్తుందని తెలిపారు. బాలింతలకు, పిల్లలకు మంచి ఆహారం అవుతుందన్నారు. వాతావరణంలో జీవ వైవిధ్యం పెరిగేలా చేస్తుందని, వాతావరణ మార్పులను తట్టుకొని నిలబడుతుందని తెలిపారు. మార్కెట్లో ఈ బియ్యం ధర కిలో రూ.200 వరకు పలుకుతుందని, కావున రైతులు తప్పనిసరిగా ఇంటి అవసరాల కోసమైనా దేశీ వరి రకాలు పండించుకోవాలని కోరారు. దేశీ రకాలను సాగు చేసిన రైతు, సిఆర్‌పి కర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎకరాకు నూర్పుతో కలుపుకొని రూ.10వేలులోపు మాత్రమే ఖర్చవుతుందని బియ్యంగా మార్చి మార్కెట్ చేయగలిగితే పెట్టుబడికి రెండింతల లాభం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఎఒ

దళితుల కరెంటు బిల్లుకు సబ్సిడీ ఏదీ?

◆ దళితుడిని బెదిరించి పింఛను డబ్బులు కట్ చేసి విద్యుత్ బిల్లు కట్టించిన లైన్‌మేన్

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని పలగర గ్రామం ఎస్‌సి గుడివాడ కాలనీలో ఉంటున్న లింగాల అసరయ్య ఎస్‌సి మాల కుటుంబానికి చెందినవాడు. ఈయనకు నవంబర్ నెల కరెంటు బిల్లు రూ.5800 వచ్చింది. అతన్ని బెదిరించి పింఛన్ డబ్బుల్లో రూ.1000 లైన్‌మేన్ కట్ చేసుకున్నాడు. మరలా డిసెంబర్ నెల బిల్లు 5,433 వచ్చింది. మరి ఈయన కట్టిన వెయ్యి రూపాయలు ఎక్కడ కట్ అయినట్టు, సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని పైగా ఎస్‌సి సబ్సిడీ ఉన్నా వేలల్లో బిల్లు ఇచ్చి బలవంతంగా వసూలు చేయడం ఎంతవరకు న్యాయమని ఆ వృద్ధుడు ప్రశ్నిస్తున్నాడు. సెంటు భూములేని నిరుపేదకి వేళల్లో బిల్లు రావడం, మరో పక్క భార్య పెరాలసిస్‌తో బాధపడుతూ ఉంటే ఈ విధంగా దగా చేయడం ఎంత వరకూ సమంజసమని బాధితుడు లబోదిబోమంటున్నాడు. తక్షణమే అధికారులు స్పందించి ఈయనకి సబ్సిడీ వచ్చేలా చర్యలు తీసుకుని దగాకు పాల్పడిన లైన్‌మేన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

అధికంగా వచ్చిన కరెంటు బిల్లును చూపిస్తున్న బాధితుడు అసరయ్య

అటవీ అధికారులతో మాట్లాడుతున్న పిఒ

ఫారెస్ట్ ఎస్‌డిఎల్‌సి సమావేశం

ప్రజాశక్తి- సీతంపేట

ఫారెస్ట్ పరిధిలో మంజూరైన గృహాల నిర్మాణాలకు సంబంధించి ఎల్‌పిసి సర్టిఫికెట్లు జారీ చేయడంలో భాగంగా 58 ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎస్‌డిఎల్‌సి సమావేశాన్ని గురువారం ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంపేట, పాలకొండ భామిని, వీరఘట్టం మండలాలకు చెందిన 58 ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎస్‌డిఎల్‌సి సమావేశంలో ఆమోదించారు. త్వరలోనే డిఎల్‌సి సమావేశం నిర్వహించి లబ్ధిదారులందరికీ ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయనున్నట్లు పీవో తెలిపారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ శాఖ అధికారులు, అటవీశాఖ డీటి పాల్గొన్నారు.

షాపులు అద్దెకు ఇస్తాం: పిఒ

సీతంపేట: సీతంపేటలో గిరిజన మ్యూజియం ఎదురుగా పిఎంఆర్‌సి కాంప్లెక్స్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఎనిమిది షాపులు అద్దెకు ఇస్తామని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. నెలసరి అద్దె వెయ్యి రూపాయలు డిపాజిట్ రూ.15వేలు కేటాయించామన్నారు. రెస్టారెంట్‌కు నెలకు రూ.3000 అద్దె డిపాజిట్ రూ.50,000 చెల్లించాలని నిర్ణయించారు. సీతంపేట పరిధిలో ఆసక్తిగల గిరిజన అభ్యర్థులు ఈనెల 12 నుంచి 19 లోగా ఐటిడిఎకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఐటిడిఎ డిపిఒ వై.సతీష్ కుమార్‌ను ఫోన్ 9392917690 సంప్రదించాలని కోరారు.

చిట్టిపూడివలసలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని చిట్టపూడివలస గ్రామంలో గురువారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయి కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు, చిన్నారులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి గ్రామంలో మహిళా సంఘాల అభివృద్ధితో పేదరికం లేని సమాజం సాధ్యమని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మూడో రోజు గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంసిఎల్‌పి విజన్ బిల్డింగ్ మెడ్యువల్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని పేదరికం లేని సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో మహిళా సంఘాలు అధికంగా అభివృద్ధి చెందుతూ తమ కుటుంబాలను బలోపేతం చేసుకొనేలా ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళా సంఘ సభ్యులకు భవిష్యత్తు ముందు చూపులో భాగంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ తమ కుటుంబాలను ఏవిధంగా బలోపేతం చేసుకొని అభివృద్ధి చెందాలనే అంశంపై శిక్షణ ఇచ్చి గ్రామస్థాయిలో మహిళ సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎస్ఐ కె.నీలకంఠం, ఎపిఎం సురేష్ బాబు, సిసిలు వెంకటరమణ, నాయక్, రమేష్, ఈశ్వరమ్మ, శారద, రామకృష్ణ, అప్పలనాయుడు, మండల సమైక్య సభ్యులు, విఒఎలు, మహిళా సంఘాల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలపైన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులకు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ అంగన్వాడి యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండే సందర్భంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అంగన్వాడి సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు, ఉద్యోగ భద్రతతో పాటు, సంక్షేమ పథకాల అమలు చేయాలని, ఇప్పటికే పెండింగ్ ఉన్న బిల్లులతో పాటు మినీవర్కర్ల సమస్య పరిష్కారం చేయాలని కోరారు. విశాఖలో ఈ నెలాఖరున జరగనున్న సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదానికి కార్మికవర్గం, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్వాడి కొమరాడ ప్రాజెక్టు కార్యదర్శి సిహెచ్ అనురాధ, సెక్టార్ నాయకులు అలివేలు, జ్యోతి, రాధారాణి, సుజాత, మాధవి, రామలక్ష్మి, సరోజినీ, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సాంబమూర్తి

ఫ్రైడే డ్రైడే అంటే ఇదేనా?

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు చేపడుతున్నా వాటి ప్రయోజనం ఎక్కడా కనిపించడం లేదు. కేవలం ప్రచారాలకే పరిమితం అవుతున్నాయని విమర్శలు వెలువెత్తుతున్నాయి. మం డల కేంద్రంతో పాటు నారాయ ణపురం, పెద్దింపేట, గౌరీపురం, అజ్జా డ, పదమాయవలస, చాకరాపల్లి, మురగడం గ్రామ సచివాలయాలోల ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోతుంది. ఈ సచివాలయాల్లో ప్రత్యేక అధికారులను నియమించినా వీరంతా ప్రతి శుక్రవారం గ్రామంలోకి వెళ్లి ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఫోటోలు తీసుకుని వెళుతున్నారే తప్ప పారిశుధ్యం మెరుగుపడలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మురుగు కాలువల వల్ల ప్రజల ఆరోగ్యం పాడవుతుందని మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగుతో అధ్వాన్నంగా ఉన్న కాలువ

ఆటో బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని రస్తాకుంటుబాయి సమీపాన కృషి విజ్ఞాన కేంద్రం మలుపు వద్ద గురువారం ఉదయం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం సీతంపేట మండలం ధోనుభాయి నుంచి కురుపాం మండలం సూర్యా నగరం గ్రామానికి గృహప్రవేశానికి ఆటోలో సుమారు 15 మంది ప్రయాణికులు వస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో పలువురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 ద్వారా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించామన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో భారీ వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పి ప్రాణ నష్టం జరగలేదన్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

రోడ్డుపై బోల్తా పడిన ఆటో

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని సీతంపేట ఎస్‌టి వీధికి చెందిన శాసపు చంద్రశేఖర రావు అలియాస్ చిన్న(25) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చంద్రశేఖరరావు గత నెల 23న రాత్రి 10 గంటల సమయంలో కొత్తూరు వైపు నుండి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గడి గుడ్డి సమీపంలో అదుపుతప్పి బోల్తా పడ్డాడు. తలకు తీవ్ర గాయం అవ్వడంతో స్థానికులు సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. దీనిపై సీతంపేట ఎస్ఐ వై.అమ్మనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి తండ్రి గోవింద, అన్నయ్య వంశీ ఉన్నారు. చంద్రశేఖర రావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అంతిమయాత్రలో పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొని సంతాపం తెలిపారు.

చిన్ని (ఫైల్)